నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
మంగళవారం | జూన్ 25, 2024 | www.navatelangana.com

నిరుద్యోగుల అభ్యర్థుల ధర్నా

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని కేబీ కాంప్లెక్స్‌లో హేమన్ డార్ఫ్ స్టడీ సర్కిల్ వద్ద సోమవారం నిరుద్యోగ అభ్యర్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్-2, గ్రూప్-3 పోస్టుల సంఖ్య పెంచాలని, ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ, బ్యాక్‌లాక్ పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోస్టులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. లేని పక్షంలో ఐటిడిఎ, కమిషనర్ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు.



అటవీ ప్రాంతంలో ఐచర్ వాహనం బోల్తా

నవతెలంగాణ-కడెం

మండలంలోని గండి మైసమ్మ అటవీ ప్రాంతంలో రోడ్డుపై ప్రమాదవశాత్తు ఐచర్ వ్యాన్ బోల్తా పడింది. ఆదిలాబాద్ నుండి కడెం, జన్నారం మండలాల వైపు వెళ్తున్న ఐచర్ బోల్తా పడడంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదంలో ఐచర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.



మాట ఇచ్చి నిలబెట్టుకున్నాం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పలువురు రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షలలు రుణ మాఫీకి మంత్రివర్గం తీర్మానించడం శుభ పరిణామమని అన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ పేరుతో కాలయాపన చేసి రైతులను బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మార్చిన విషయాన్ని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దయానంద్, చిన్నం సత్యం, తోట సత్యం, కదార్ల గంగనర్సయ్య, హమానుల్లాఖాన్, నేరెల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని గిరిజనుల వినతి



నవతెలంగాణ-తలమడుగు

డోర్లి రైల్వే గేట్ నుండి కప్పర్‌దేవి ఎక్స్ రోడ్ వరకు సదరు కాంట్రాక్టర్ రోడ్డును సకాలంలో నిర్మించాలని ఆయా గ్రామాల గిరిజనులు సోమవారం ఎంపీడీఓ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టి మధ్యలో ఆపేయడంతో దాదాపు పది గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. రోడ్డు మధ్యలో చెరువును తలపిస్తోందన్నారు. కాంట్రాక్టర్, సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వారు వాపోయారు. కనీసం మోటార్ సైకిల్ కూడా నడవలేని స్థితిలో గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా కనీసం మొరం రోడ్డునైనా నిర్మించి రాకపోకలు పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆయా గ్రామాల గిరిజనులు దాంజే పటేల్, కృష్ణ, పోశెట్టి, కాంతారావు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన హెచ్‌డబ్ల్యుఓ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గురుకుల సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం టీజీపీఎస్సీ ద్వారా సోమవారం నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని నలంద కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా రెండు సెషన్‌లలో పరీక్ష జరిగింది. మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. అభ్యర్థులు ఉదయం 9గంటలకు కేంద్రానికి చేరుకోగా వారిని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు హాల్ టికెట్, ఒరిజనల్ గుర్తింపు కార్డులను పరిశీలించి లోనికి అనుమతించారు. రెండవ సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు రెండవ పేపర్ నిర్వహించారు. ఉదయం పరీక్షకు వంద మంది అభ్యర్థులకు 74 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావ్ తెలిపారు. రెండవ పేపర్‌కు వంద మందికి 73 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. అదే విధంగా పరీక్ష ముడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. జిల్లా నుంచి 500 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

మండల స్థాయి ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ జయశీల ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఎంపిక పోటీలకు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ ఎస్.స్వామి, క్రీడా పాఠశాల శిక్షకులు రాజు, రమేష్, కబీర్ పాల్గొన్నారు

గుర్తుపడితే సమాచారం ఇవ్వండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల రెండు చోట్ల చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ నిందితుల ఫొటోను పోలీసులు విడుదల చేశారు. బేల, తాంసి మండలాల్లో మహిళల మెడలోంచి గుర్తుతెలియని దుండగులు చైన్ స్నాచింగ్ చేసిన విషయం తెలిసిందే. స్నాచర్ ఎవరైన గుర్తుపడితే ఎస్డీపీఓ 8712659914, జైనథ్ సీఐ 8712659916, రూరల్ సీఐ 8712659915 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట సర్పంచుల సంఘం అధ్యక్షులు తిరుమలగౌడ్ ఉన్నారు.

ఇది ప్రజా విజయం : హరీష్‌బాబు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ దీక్ష, విరమణ
- యుద్ధ ప్రాతిపదికన పూర్తయిన పెద్దవాగు వంతెన అసంపూర్తి పనులు
- శాశ్వత వంతెనపై రాకపోకలు ప్రారంభించిన ఎమ్మెల్యే హరీష్

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

అందవెల్లి శాశ్వత వంతెనపై ఎట్టకేలకు సోమవారం సాయంత్రం రాకపోకలు ప్రారంభమవగా, ఇది ప్రజా విజయమని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్‌నగర్-దహెగాం ప్రధాన రహదారి అందవెల్లి సమీపంలోని పెద్దవాగుపై తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో శాశ్వత వంతెన పనులు యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సోమవారం బ్రిడ్జి వద్ద దీక్షకు దిగారు. శాశ్వత వంతెన అసంపూర్తి పనులు అధికారులు యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయించారు. జగన్నాథ్‌పూర్ వైపు అబార్ట్మెంట్ కొంత అసంపూర్తిగా ఉండడంతో పనులు పూర్తయ్యేవరకు ఎమ్మెల్యే పట్టుబట్టారు. డీఈ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కొద్దిపాటి అసంపూర్తి పనులను యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయించారు.



వంతెన పూర్తికావడంతో సాయంత్రం ఎమ్మెల్యే హరీష్ బాబు దీక్ష విరమించారు. ఎమ్మెల్యే శాశ్వత వంతెనపై ఆటోలో ప్రయాణించి రాకపోకలను ప్రారంభించారు. అంతకు ముందు బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కొట్టుకుపోయిఐన వంతెనను పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు సిందం శ్రీనివాస్, కొప్పుల శంకర్, వీరభద్రచారి, చన్నపురి గణపతి, కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్ పాల్గొన్నారు.

రైతులను ముంచే ఆలోచన మానుకోవాలి

నవతెలంగాణ-మంచిర్యాల

నేషనల్ హైవే-63 రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు సోమవారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే పీడీ కార్యాలయం ముందు ధర్న నిర్వహించారు. అనంతరం నేషనల్ హై వే అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే 63కు సంబంధించి అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలైన్మెంట్లు మార్చి మూడవ అలైన్మెంట్‌గా 72జీవో జారీ చేసి రైతులను ఆగం చేస్తున్నారని తెలిపారు. 72జీవో నోటిఫికేషన్ ద్వారా గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద భూములు కోల్పోయి నిర్వాసితులైన రైతులు, మరొకసారి వారి భూములు కోల్పోయే పరిస్థితి వచ్చిందని, ఈ విధంగా మరోసారి భూములు కోల్పోవడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. భూములను నేషనల్ హైవే అధికారులు తీసుకోవడాన్ని నేరంగా పరిగణించాలన్నారు. అధికారుల తప్పుడు విధానాల వల్ల వందలాది మంది రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, దానికి పూర్తి బాధ్యత ఎన్‌హెచ్ అధికారులే తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తమ తప్పుడు నిర్ణయాలను వాయిదా వేసుకొని గత సంవత్సరం ఇచ్చిన నోటిఫికేషన్‌ను పునరుద్ధరించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని తెలిపారు. కొత్తగా ఇచ్చిన 72 నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తులా మధుసూదన్‌రావు, రైతు నాయకులు లగిసెట్టి రాజమౌళి, జనార్దన్‌రెడ్డి, పెట్టం తిరుపతి, తిప్పని మల్లేష్, గొల్ల తిరుపతి, మంచిగట్ల మల్లేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్ఆర్ బోస్, బీసీ ఐక్యవేదిక నాయకులు గుమ్ముల శ్రీనివాస్, వడ్నాల శ్యాం, కొండల్‌రెడ్డి, అల్లి పరమేష్, అల్లి లక్ష్మి, స్వచ్ఛంద పౌర సేవా సంస్థ అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య సోమ రాములు, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతులు పాల్గొన్నారు.



జిల్లాలో సికిల్ సెల్ నిర్మూలన దిశగా కృషి చేయాలి

- కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి జయ



నవతెలంగాణ-నస్పూర్

సికిల్‌సెల్‌ను పూర్తి స్థాయిలో నిర్మూలించే దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి జయ అన్నారు. సోమవారం ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్‌లో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి సర్వేశ్వర్‌రెడ్డి, వైద్య-ఆరోగ్యశాఖ కార్యదర్శి డా. అమర్‌సింగ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్య-ఆరోగ్యశాఖ, సంబంధిత శాఖల అధికారులతో సికిల్‌సెల్ నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం కింద సికిల్ సెల్ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యాధిగ్రస్తులు ప్రతి రోజు తీసుకోవలసిన పౌష్టిక ఆహారంపై వివరించాలని, పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, బాధితులు అధికంగా ఉండే ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నుండి అందించిన పాయింట్ ఆఫ్ కేర్ టెస్ట్ కిట్లను బాధితులకు అందజేయాలని, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి రోజు వివరాలను నమోదు చేయాలని తెలిపారు. బాధితులకు స్క్రీనింగ్ టెస్ట్‌లో వ్యాధి ఉన్నట్లుగా నిర్ధారణ అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా టి-హబ్‌లో హెచ్‌పిఎల్‌సి పరీక్ష నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సికిల్ సెల్ వ్యాధి జన్యుపరంగా సంక్రమిస్తుందని, ఎర్ర రక్తకణాలు తమ రూపాన్ని మార్చుకొని రక్తనాళాలలో రక్తం ప్రవహించడంలో ఇబ్బందులు ఏర్పడి చచ్చుపడిపోవడం, ఎముకలు బలహీనమవుతాయని, ఇతర అనేక వ్యాధులకు కారణమవుతాయని అన్నారు. ఈ వ్యాధిని తొలిదశలోనే గుర్తించి నిరోధించడానికి తగు చర్యలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జూలై 3 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సికిల్ సెల్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని 149 ఉప కేంద్రాలు, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలలో ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని ప్రత్యేక ప్రచార శిబిరాలలో పరీక్ష సౌకర్యాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత, ప్రోగ్రాం అధికారి డా. ఫయాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రూ.44లక్షల నిషేధిత గుట్కా స్వాధీనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డైమండ్ ట్రాన్స్‌పోర్ట్ గోడౌన్‌లో తనిఖీ చేయగా రూ.41,31,500 విలువ గల నిషేధిత గుట్కా లభించిందని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..సోమవారం తనిఖీ చేయగా గుట్కా లభించింది. ఈ కేసులో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఏ1 రహమతుల్లా, ఏ2 అర్బాజ్‌ఖాన్, ఏ3 సైపుల్లాఖాన్, ఏ4 షమీముల్లా ఖాన్, ఏ5 పసివుల్లాఖాన్, ఏ6 సాజిదుల్లాఖాన్ ఉన్నారు. వీరిపై సిగరెట్ అండ్ టొబాకో యాక్ట్‌ల కేసు నమోదు చేశారు. గోడౌన్ నుండి ధరివల్ టొబాకో, అన్వర్ టొబాకో, ఆర్ఎస్ఎక్స్ఎల్, 999 షార్ట్, యూకే టొబాకో, తోట టొబాకో, జెకె టొబాకో లాంటి రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన గుట్కా లభించింది. అదేవిధంగా అంబేద్కర్ చౌక్‌లో గల అస్లాం ట్రేడర్స్‌లో ఆకస్మిక దాడి నిర్వహించగా, అందులో దాదాపు 20 రకాల రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన గుట్కా లభించింది. వాటి విలువ రూ 2,87,500 ఉంటుంది. ఇందులో ఏ1 అర్బాజ్ ఖాన్, ఏ2 సైపుల్లా ఖాన్, ఏ3 షమీముల్లా ఖాన్, ఏ4 పసివుల్లా ఖాన్, ఏ5 సాజిదుల్లా ఖాన్ ఉన్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. రెండు కేసులలో మొత్తం రూ. 44,19,000 విలువచేసి నిషేధిత గుట్కా లభించింది. గుట్కాను జిల్లా వ్యాప్తంగా సమూలంగా రూపుమాపేంత వరకు ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ పేర్కొన్నారు.



ఎంపీటీసీలు మళ్లీ గెలిచి రావాలి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఎంపీటీసీలకు ఇదే చివరి సమావేశమని, రానున్న స్థానిక ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి మండల పరిషత్ సభ్యులుగా రావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. ఐదేండ్లు పదవిలో ఉండి మండలంలో వివిధ అభివృద్ధి పనులు చేసిన సభ్యుల తీరును ప్రశంసించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు జవాబుదారిగా పనిచేయాలని తెలిపారు. ప్రధానంగా విద్యా, వైద్యం, వ్యవసాయం, విద్యుత్తు, అటవీ శాఖల అధికారుల నుంచి ప్రజలకు సమస్యలు ఎదురుకాకుండా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా నిర్లక్ష్య ధోరణి అవలంభించే అధికారులను సహించేది లేదన్నారు. బాగా పనిచేసే అధికారులకు తన నుంచి ఎంతటి సహకారమైనా అందిస్తానని చెప్పారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా వ్యవహరించే నాయకులు తమ విధానం మార్చుకోవాలని హెచ్చరించారు. శాఖల అధికారులు ప్రజలు అవసరమై ఫోన్ చేసినప్పుడు స్పందించాలని సూచించారు.

ఎంపీపీపై అధికారుల అసహనం

ఎంపీపీ మోహిద్ తీరుపై మండల సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు అసహనం వ్యక్తం చేశారు. తాము ఏదో తప్పు చేసినట్లుగా ఎంపీపీ అధికారులను వేదికపై పదేపదే ప్రశ్నించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండి అధికారులకు సూచనలు చేసే అవకాశం ఉన్నా ఎంపీపీ అలా కాకుండా ఎమ్మెల్యే హాజరైన సమావేశంలో తమ పనితీరును ఎండగట్టడం ఏమిటని పలువురు అధికారులు గుసగుస లాడుకున్నారు. ఎంపీపీ మోహిద్ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, సత్తనపెల్లి పీఏసీఎస్ చైర్మెన్ అమంద శ్రీనివాస్, ఎంపీడీఓ, ఎంపీఓ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 66శాతంపైగా ఉత్తీర్ణత

- రీకౌంటింగ్, రీవేరిఫికేషన్‌కు నేటి నుండి దరఖాస్తు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఎవరికైన ఫలితాల పట్ల సందేహాలు ఉంటే రీకౌంటింగ్, రీ వేరిఫికేషన్‌కు ఈ నెల 25 నుంచి 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్ బోర్డ్ అధికారి రవీందర్ కుమార్ సూచించారు. విడుదలైన సప్లిమెంటరీ ఫలితాల్లో మొదటి సంవత్సరంలో జనరల్‌లో 3,313 మంది విద్యార్థుకు 2,212 మంది విద్యార్థులు, ఒకేషనల్‌లో 128 మందికి 91 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 2వ సంవత్సరం జనరల్‌లో 2,334 మంది విద్యార్థులకు 1,479 మంది విద్యార్థులు, ఒకేషనల్‌లో 235 మంది విద్యార్థులకు 133 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొత్తంగా మొదటి సంవత్సరంలో 66.77 శాతం, రెండవ సంవత్సరంలో 63.77 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీ కౌంటింగ్‌కు రూ.100, రీ వేరిఫికేషన్‌కు రూ.600 చెల్లించి ఆన్‌లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నేరస్తుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకం



నవతెలంగాణ-జైపూర్

నేరాల నియంత్రణలో భాగంగా నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరమని ఎస్సై శ్రీధర్ అన్నారు. మంచిర్యాల-చెన్నూర్ ప్రధాన రహదారి జైపూర్ ఎస్టీపీపీ ఎదుట ప్రధాన కూడలిలో సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. జాతీయ రహదారి నెం.63లో వాహనాల రాకపోకల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రమాదాలను నియంత్రించడంతో పాటు నేరస్తులను గుర్తించడానికి ఐదు సీసీ కెమెరాలను ప్లాంట్ అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ దారి గుండా వివిధ రాష్ట్రాలకు చెందిన వాహనాల రాకపోకల రద్దీని దృష్టిలో పెట్టుకుని అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాలలో నమోదవుతున్న వాహనాల రాకపోకలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించడంతో పాటు వాహనాల స్పీడ్‌ను గుర్తించడం జరుగుతుందని తెలిపారు.. ఫలితంగా రోడ్డు ప్రమాదాలపై పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు నేరస్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నితిక పంత్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడ రెండో బెటాలియన్ కమాండెంట్‌గా సోమవారం నితిక పంత్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు బెటాలియన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.



ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో కుక్ మ్యాన్‌గా పని చేసిన కాంబ్లె బాలాజీ ఆదివారం అనారోగ్యంతో మరణించాడు. సోమవారం కుటుంబానికి సంఘం తరపున హెచ్‌డబ్ల్యూఓ రూ.20వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. డీడీతో మాట్లాడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించి జీవనోపాధి కల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పి.జంగు, నారాయణ, టి.రంభ, మోతుబాయి, కమల, భరత్, భగవాన్, విక్రమ్, కేసరిబాయి, వెంకటి, కొమురయ్య, రాందాస్ పాల్గొన్నారు.

విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

విద్యార్థులకు కనీస మౌలిక వసతులు, విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని అన్నారు. సోమవారం మండలంలోని చాందా(టి) మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల అందిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన అక్కడకు వెళ్లి పరిస్థితులను పర్యవేక్షించారు. తరగతి గదులను, అందుతున్న బోధన తీరును పిల్లలను అడిగితెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను సందర్శించి, వంట సరుకులను, ఇతర సామగ్రిని పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు షకీల్ ఉన్నారు.



మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆశ్రమ పాఠశాలలో మరమ్మతులను త్వరితగతిని పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులకు సూచించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో మరమ్మతులు పూర్తి స్థాయిలో చేయాలని కోరారు. తాగునీరు, టాయిలెట్స్, స్నానపు గదులు, విద్యుత్ సౌకర్యం లాంటి పనులు పూర్తి చేసి, విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ డీడీ, ఏటీడీఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏజెన్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

- తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, షెడ్యూల్ ప్రాంతంలో మెగా డీఎస్సీ వేయాలని కోరుతూ సోమవారం తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాకు అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్కాబాపు రావు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో మెగా డీఎస్సీ ఏర్పాటు చేసి, ఏజన్సీలో ఉన్న బ్యాక్ లాక్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జీఓ నెంబర్ మూడును యదావిధిగా కొనసాగించాలని, జీఓ నెంబర్ మూడు ప్రకారమే ఉద్యోగస్తులకు ప్రమోషన్‌లు, బదిలీలు చేపట్టాలని అన్నారు. పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసులకు పట్టాలు ఇవ్వాలని, 1/70 చట్టాలను ఏజన్సీ ప్రాంతాల్లో పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, 5వ షెడ్యూల్ ప్రాంతంలో జీఓ నెంబర్ 317ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి గణేష్, జిల్లా నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

గజేందర్ కుటుంబానికి న్యాయం చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల హతమైన గిరిజన ఉపాధ్యాయుడు గజేందర్ కుటుంబానికి అధికారులు న్యాయం చేయాలని, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. సోమవారం నాగల్‌కొండ గ్రామంలో నిర్వహించిన తెరివి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా గజేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంజారా సంఘం జిల్లా నాయకులు రెడ్డి నాయక్, ప్రకాష్, ఫ్యాక్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, బంజార యువసేన జిల్లా నాయకులు రాథోడ్ సంజీవ్ నాయక్, నాయకులు పవార్ దేవిదాస్, నేతావత్ రాందాస్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు రాజు, విష్ణు, జాదవ్ సునీత నారాయణ్, రాథోడ్ మధుకర్, ఎంపీటీసీ కళావతి ఉత్తం, బంజారా యువసేన మండల నాయకులు జాదవ్ దత్త పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. నేరడిగొండ మండలం బుగ్గరాం గ్రామానికి చెందిన స్వాతి తన అటవీ హక్కు పత్రంపై పేరు మార్పించమని, ఇంద్రవెల్లి మండలం మర్కగూడ గ్రామానికి చెందిన భీంరావ్ తనకి కిరాణా దుకాణం మంజూరు చేయించాలని, ఉట్నూర్ గ్రామానికి చెందిన శశిరేఖ ఏదైనా గురుకుల పాఠశాలలో ఉద్యోగం కావాలని, నేరడిగొండ మండలం చించొలి గ్రామానికి చెందిన సూర్యామణి మేకల లోన్ కావాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు చేయాలని, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీఓ కనక భీంరావ్, డీడీ దిలీప్ కుమార్, అదనపు వైద్యాధికారి కుంరం బాలు, ఆర్‌సీఓ గంగాధర్, ఎఒ రాంబాబు, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతదేహం లభ్యం

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని గాజిలి అటవీ ప్రాంతంలో సోమవారం అనుమానస్పద స్థితిలో మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజిలి గ్రామానికి చెందిన పెందూర్ మహేష్(19) వేసుకున్న దుస్తుల ఆధారంగా మహేష్ మృతదేహాన్ని గుర్తించామని తెలిపారు. మృతుడి పెందూరు వెంకట్‌రావ్ కొద్ది రోజుల క్రితమే మరణించాడు. కాగా మహేష్ అనుమానస్పద స్థితిలో మృతదేహం కనిపంచడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రెండో రోజు 72 మంది విద్యార్థులు హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికెట్ వేరిఫికేషన్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని పాలిసెట్ సమన్వయకర్త కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ తెలిపారు. కాగా సోమవారం రెండో రోజు 72 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా, 72 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. మంగళవారంతో సర్టిఫికెట్ వేరిఫికేషన్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకున్న విధంగా హాజరై, తమ ధృవపత్రాలను వేరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. వేరిఫికేషన్ పూర్తయిన వారు వెబ్ అప్షన్లు పెట్టుకొని కళాశాలలను ఎంపిక చేసుకోవాలని అన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని గడ్‌చాంద గ్రామంలో శ్రీరాంసాగర్ జలాశయం బ్యాక్ వాటర్ భూములను ఆక్రమించి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గ్రామస్తులు కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన 2వేల ఎకరాల భూమి శ్రీరాంసాగర్ జలాశయంలో ముంపునకు గురైందని, మిగులు భూమిని కొందరు ఆక్రమించుకొని, విక్రయిస్తూ పంటలు సాగు చేస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు.

నాణ్యమైన విద్యనందించేందుకు కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

విద్యార్థులకు నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఖానాపూర్ నియోజవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో సైన్స్ ల్యాబ్ గదుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలో నూతన కేజీబీవీ పాఠశాలను ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలతో నిర్మాణ పనులను చెపడుతొందన్నారు. జడ్పీఎస్ఎస్, ఎంపీపీఎస్, పాఠశాలలో సోషల్‌వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ, మైనారిటీ గురుకులాలో, కేజీబీవీ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని వారు తెలిపారు. అమ్మఆదర్శ పాఠశాల పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని తెలియజేశారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలోనూ ఆంగ్ల మాధ్యమంలో విద్యను బోధించడం జరుగుతుందని అన్నారు. విద్య వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని సూచించారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలంటే, వివిధ రకాల చెట్లను నాటాలని, గ్రీనరీని ఏర్పాటు చేయాలని సూచించారు. నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు, పాఠశాల సిబ్బంది పలు సూచనలు చేశారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడెం ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్, సెక్టోరల్ అధికారి సలోమి కరుణ, ఎంఈఓ మధుసూదన్, ఎస్ఓ విమల, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి జూడాల సమ్మె

- సూపర్ స్పెషాలిటీ ఎదుట బైటాయింపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాని విన్నవించిన పట్టించుకోవడం లేదని రిమ్స్ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్‌చారి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి ఓపీ సేవలను బహిష్కరించి, సమ్మెలో పాల్గొన్నారు. సోమవారం పట్టణంలోని సూపర్ స్పెషాలిటి ఆస్పత్రి ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నిరసన తెలిపారు. ఎమర్జెన్సీ సేవలు తప్ప ఇతర సేవలు చేయబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్ చారి మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లకు సంబంధించిన ఎనిమిది డిమాండ్లపై ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రెండు రోజులు నల్ల బ్యాడ్జీలతో సైతం నిరసన తెలిపామని అన్నారు. వాటిపై స్పష్టత రానిపక్షంలో సమ్మెకు వెళ్తామని, నోటీసు కూడా ఇచ్చామని తెలిపారు. అయిన ప్రభుత్వం స్పందించని కారణంగా జూనియర్ వైద్యులు ఓపీ సేవలు బహిష్కరించి, సమ్మె బాట చేపట్టామన్నారు. స్టైఫండ్ పెండింగ్‌లో ఉన్నాయని, మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్లకు వసతులు లేవన్నారు. సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌లకు గౌరవ వేతనం ఇవ్వలన్నారు. వివిధ ప్రభుత్వ ఆస్పత్రులలో భద్రతా సమస్యలు ఉన్నాయన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు తమ ఆందోళనలు, సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజుయాదవ్, కార్తీక్, సురజ్, కోశాధికారి బాలమురుగన్, జహ్నవి, రష్మీ, వైద్యులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బేల

మండలంలోని చాంద్‌పెల్లి బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందని మాజీ సర్పంచ్ కోరెంగె జంగ్‌షాప్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు చేపట్టింది. బడీడు పిల్లలను బడికి చేర్పించాలనే ఉద్యేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. చాంద్‌పెల్లి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 153 మందికి గాను, 34 మంది విద్యార్థులే ఉన్నారని అన్నారు. అది కూడా స్థానిక విద్యార్థులే ఉన్నారని తెలిపారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించి, పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా చూడాలి. కానీ ఉపాధ్యాయులు చొరవ చూపించడం లేదు. చాంద్‌పెల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మొత్తం 12 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. కానీ ఉదయం ప్రార్థన సమయంలో కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగితా ఉపాధ్యాయుల సంగతి దేవుడెరుగు. ఇలాగైతే గిరిజన విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క జిల్లా విద్యాధికారి అన్ని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉదయం ప్రార్థన సమయం నుంచి సాయంత్రం పాఠశాల ముగిసేంతవరకు బడిలోనే ఉండాలని హెచ్చరిస్తున్నా ఇక్కడ అమలు కావడం లేదని ఆరోపణలు వినిపుస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన పాఠశాలపైన ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాంద్‌పెల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని ఆ గ్రామ మాజీ సర్పంచ్ కోరంగే జంగ్ షాప్ తెలిపారు.

ఇలాగైతే విద్యార్థులకు విద్య అందుతుందా అని ప్రశ్నించారు. గ్రామ పటేల్ కోరంగే సోనేరావ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు సమయ పాలన పాటించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నత అధికారులు గిరిజన ఆశ్రమ పాఠశాలలపైన దృష్టి సారించాలని కోరారు.

ప్రజాప్రతినిధులతోనే సమస్యలు పరిష్కారం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ప్రజాప్రతినిధులతోనే పరిష్కారం అవుతాయని జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మండలాధికారులు తమ ప్రగతి నివేదికలను ఒక్కొక్కరు చదివి వినిపించారు. అనంతరం జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కారమయ్యేంతవరకు సమస్యలను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు మండల, జిల్లా అధికారులకు తెలియజేసి పరిష్కరించే విధంగా ప్రజాప్రతినిధులు కీలక పాత్ర వహిస్తారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో మండలాధికారులు జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపీపీ జయశ్రీ, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీలను శాలువాతో సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి, స్థానిక ఎస్సై నరేష్, ఎంపీటీసీలు సొంటకే గజానంద్, మురళీమోహన్, తిరుమల పాల్గొన్నారు.

రుణమాఫీతో రైతు కండ్లలో ఆనందం

నవతెలంగాణ-తాంసి

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని ఇచ్చినా మాటకు కట్టుబడి ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని క్యాబినెట్ ఆమోదం తెలిపినప్పటి నుంచి తెలంగాణ రాష్ట్ర రైతుల కండ్లలో ఆనందం కనబడుతుందని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15లోపు పూర్తి చేస్తామని, మాట ఇచ్చినప్పటి నుంచి రైతుల కండ్లలో ఆనందం కనబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, నారాయణ, హన్మండ్లు, సంతోష్, రామన్న యాదవ్, లింగారెడ్డి, నరేష్, గంగారెడ్డి, గజానన, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మూతబడిన పాఠశాల పున: ప్రారంభం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పదేండ్ల కింద మూతబడిన పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఈ పాఠశాల స్థలాన్ని స్థానిక కొందరు నాయకులు కబ్జా చేయాలని చూశారన్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను దురాక్రమణ చేయాలని చూస్తే, ఊరుకునేది లేదని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ప్రజల ఆస్తులను కాపాడుకోవడం అందరు బాధ్యత అన్నారు. పట్టణంలోని రోడ్డు వెడల్పు వల్ల పాఠశాల స్థలం కొంతమేరకు పోయినా, మిగతా స్థలంలో పాఠశాలను అభివృద్ధి చేసి కొనసాగిస్తామని చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులను నియమించుకనే ఏర్పాట్లు చేసుకోవాలని ఎంఈఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, వైస్ చైర్మెన్ సంతోష్, నాయకులు దయానంద్, నిమ్మల శ్రీనివాస్ కే.గంగనర్సయ్య, హమానుల్లాఖాన్, ఎంఈఓ మధు సూధన్, కమీషనర్ మనోహర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపల్ తుకారాం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రయివేటుకు దీటుగా నాణ్యమైన విద్యనందిస్తున్న ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు చేరాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం ఇంటర్‌లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల కేసులో నిందితులకు బెయిల్ రద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నకిలీ విత్తనాల కేసులో ప్రధాన నిందితుల బెయిల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు రద్దు చేసినట్టు పట్టణ డీఎస్పీ జీవన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 25న పట్టణంలో పెద్ద ఎత్తున నకిలీ విత్తనాల తయారు కేంద్రాన్ని నెలకొల్పి, రైతులను మోసగించే ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులకు బెల్ లభించడంతో, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు జిల్లా సెషన్స్ కోర్టులో రివిజన్ ఫైల్ చేసినట్టు పేర్కొన్నారు. వాదనలు విన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు బెయిల్‌ను రద్దుచేసి మూడు రోజుల్లోగా లొంగిపోవాలని తీర్పునిచినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఏ1 సామ అశోక్‌రెడ్డి, ఏ2 రాజేందర్‌లు మున్సిఫ్ కోర్టులో లొంగిపోయారని పేర్కొన్నారు. వారికి కోర్టు వారు 14 రోజుల జ్యూడిషియల్ కస్టడీని విధించడం వల్ల జిల్లా జైలుకు తరలించడం జరిగిందని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని జాల్నా, కర్ణాటక, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలలో గల ఆఫీసులలో తనిఖీలు నిర్వహిస్తూ విచారించేందుకు జిల్లా పోలీసులు తరపున ప్రధాన నిందితులను 10 రోజుల పోలీసు కస్టడీని కోరడం జరిగిందని పేర్కొన్నారు. నేరానికి పాల్పడినటువంటి నిందితులకు ఆశ్రయమిచ్చిన షాపుల ఓనర్‌కు నోటీసులు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. గోడౌన్‌ను తహసీల్దార్ సమక్షంలో స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో విద్యనందించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్




నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు విద్యనందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని బొరిగామ గ్రామ పాఠశాలలో రూ.13.50లక్షలతో సైన్స్ ప్రయోగశాల నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాఠశాలను పరిశీలించి, సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను విద్యార్థులు శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు పాండురంగ్, మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, సాబీర్, రమేష్, గాడ్గే సుభాష్, నర్సింహారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, దిలీప్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ వేయాలని అభ్యర్థుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రమోషన్ల ద్వారా ఏర్పడ్డ ఖాళీలను ఎస్జీటీ, ఎస్ఏల ద్వారా భర్తీ చేయాలని, నిరుద్యోగ డీఎస్సీ అభ్యర్థులు అన్నారు. మెగా డీఎస్సీని వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం లైబ్రరీ ఆవరణలో ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, పోస్టుల భర్తీకి త్వరగా డీఎస్సీని వేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి డీఎస్సీ వేస్తుందని, ఎంతో నమ్మకంతో సన్నద్ధం అవుతున్నామని, కానీ ఇప్పుడు గత ప్రభుత్వం 203 పోస్టులు చూపిస్తే ఇప్పటి ప్రభుత్వం 206 కేవలం మూడు పోస్టులనే పెంచిందన్నారు. అధికారుల తప్పిదాల వల్ల నష్టపోతున్నామని, ఆవేదన వ్యక్తం చేశారు. టెట్ క్వాలిఫై అయిన వారికి సమయం ఇవ్వకుండా డీఎస్సీని వేయడం సరికాదన్నారు. వెంటనే దాన్ని రద్దు చేసి మెగా డీఎస్సీ వేయాలని కోరారు. కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | జూన్ 25, 2024 | www.navatelangana.com

అంతర్రాష్ట్ర వంతెనపై తనిఖీ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని గూడెం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ సోమవారం పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్లు రైతులకి కావాల్సిన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎవరైనా అక్రమంగా ఎరువులని మహారాష్ట్రకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గూడెం అంతర్రాష్ట్ర వంతెనపై వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు. ఎరువులని మహారాష్ట్రకు తరలిస్తే వాహనాన్ని సీజ్ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి సమస్యలున్న వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

ఉద్యోగోన్నతి బాధ్యతను మరింత పెంచుతోంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉద్యోగులకు ఉద్యోగోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని జిల్లా వైద్యాధికారి తుకారం భట్ అన్నారు. ఆస్పత్రిలో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న ఏడుగురికి సూపర్‌వైజర్లుగా పదోన్నతి వచ్చిన నేపథ్యంలో వారు జిల్లా వైద్యాధికారిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుందన్నారు. ప్రజలకు సేవ చేసినప్పుడే గుర్తింపు వస్తుందని తెలిపారు. వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని దానికి మరింత వన్నె తేవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, డిపిహెచ్ ఎన్.నరసమ్మ, పదోన్నతి పొందిన సూపర్‌వైజర్లు శారద, ఫ్లారెన్స్, విజిత, గ్లోరీ సుజాన, కృపావాణి, జమున, ప్రసన్న పాల్గొన్నారు.

ప్రజావాణికి రాకుంటే షోకాజ్ నోటీసులు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- మొదటి ప్రజావాణిలోనే కలెక్టర్ మార్క్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా సమస్యలు పరిష్కరించడం అధికారుల ప్రథమ కర్తవ్యమని అటువంటి ప్రజావాణికి అధికారులు హాజరు కాకపోవడం క్షమించరాని నేరమని, రానున్న ప్రజావాణికి హాజరు కాని జిల్లా అధికారులకు షోకాజు నోటీసులు అందజేయనున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదుదారుల వద్ద నుండి దరఖాస్తు స్వీకరించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి ప్రజావాణిలో పాల్గొన్న కలెక్టర్ జిల్లా అధికారులకు వార్నింగ్ ఇచ్చి తన మార్కు చూపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ (స్థానిక సంస్థలు), దాసరి వేణు (రెవెన్యూ), ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వరరావు, కాశబోయిన సురేష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీటీమ్ లక్ష్యం



నవతెలంగాణ-కెరమెరి

మహిళల భద్రతే షీటీమ్స్ లక్ష్యమని షీ టీమ్ ఇన్‌చార్జి సునీత అన్నారు. సోమవారం మండలంలోని గోయాగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్, వాట్సాప్ కాల్స్ మాట్లాడవద్దన్నారు. అపరిచిత వ్యక్తులు, గ్రూపుల నుండి వచ్చిన గుర్తు తెలియని లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ని సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. మహిళలు ఆపద సమయంలో డయల్ 100 లేదా షీ టీమ్‌ను సంప్రదించాలన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు టీ సేఫ్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షీ టీమ్ 8712670564కి వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేసిన తగిన చర్య తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆడే ప్రకాష్, డబ్ల్యూపీసీ శ్రీలత, కెరమరి పోలీస్‌స్టేషన్ సిబ్బంది మురహరి, జంగు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో చేరేందుకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన ఆసిఫాబాద్‌లోని బాలుర వసతి గృహం, కళాశాల వసతి గృహంలో ప్రవేశాలకు విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రీమెట్రిక్ వసతి గృహంలో 40 సీట్లు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో 86 సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హతగల విద్యార్థులు బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి, ఆసిఫాబాద్ ఫోన్ నెం. 9441170044ను సంప్రదించాలన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయిపడ్డ పీఎఫ్, ఎన్ఎంఆర్ పారిశుద్ధ కార్మికుల వేతనాలు చెల్లించేలా ప్రాతినిధ్యం వహించాలన్నారు. రెండవ పీఆర్సీలో కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఇ. శంకర్, ఉపాధ్యక్షులు మల్లేష్, కార్యదర్శి సంజీవ్, ఉపాధ్యక్షురాలు శంకరమ్మ రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో వివిధ గ్రూపులలో ఖాళీగా ఉన్న 32 సీట్లకు ఈ నెల 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు బుధవారం ఉదయం 11 గంటలకు పాఠశాలకు హాజరై బోనఫైడ్, పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని, పదవ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స.. ఐదేండ్ల చిన్నారి మృతి

- వైద్యం వికటించే మృతి చెందిందని బంధువుల ఆరోపణ
- ఆస్పత్రి ఎదుట ఆందోళన
- పరామర్శించిన నాయకులు



మృతి చెందిన చిన్నారి లోహిత



ఆస్పత్రి ఎదుట గుమిగూడిన కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కాలనీకి చెందిన ఇగురపు లోహిత (5) అనే చిన్నారి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జనకాపూర్ కాలనీకి చెందిన ఇగురపు హరీష్ చిన్న కూతురు లోహిత ఆదివారం రాత్రి వాంతులతో బాధపడుతుండగా పట్టణంలోని కోర్టు చౌరస్తా సమీపంలోని శ్రీ సాయి పిల్లల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స నిర్వహించారు. కొద్దిసేపటి తర్వాత చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. దీంతో హుటాహుటిన అంబులెన్స్‌లో లోహితను కాగజ్‌నగర్ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లోహిత మృతి చెందిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు లోహిత మృతదేహాన్ని ఆసిఫాబాద్‌కు తీసుకువచ్చి శ్రీ సాయి పిల్లల ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆస్పత్రిలోని వైద్యుల వైద్యం వికటించడంతోనే చిన్నారి మృతి చెందిందని ఆరోపించారు. కుటుంబ సభ్యులు, వైద్యులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి ఆందోళనకారులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అర్ధరాత్రి వరకు ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన కొనసాగింది. దీంతో ఆస్పత్రి యాజమాన్యం బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమింప చేశారని సమాచారం.

బాధితులకు పరామర్శ

జిల్లా కేంద్రాల్లోని సాయి ఆస్పత్రిలో ఆదివారం రాత్రి మరణించిన లోహిత కుటుంబ సభ్యులకు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ రేగుంట కేశవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి మృతికి కారణమైన ఆస్పత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నారికి ఎక్కువ డోసు ఉన్న ఇంజక్షన్లు వేశారని ఆరోపించారు. ఆస్పత్రిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులున్నారు.



వైద్యునితో మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు

ఎండీఎం కార్మికులకు రూ.10వేల వేతనం చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా..కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, ఎండీఎం కార్మికులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా నాయకుడు కృష్ణమాచారితో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసున్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు, టిఫిన్స్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. నూతన ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల వేతనం చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కోడిగుడ్లకు కేటాయించే బడ్జెట్ సరిపోవటం లేదన్నారు. కార్మికులకు గ్యాస్ సబ్సిడీ కింద అందించాలన్నారు. వీటితో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్రంగి శారద, పగిడి మాయ, మండల నాయకులు తిరుపతి, విజయ, శ్యామల, పద్మ, వనిత, బాయక్క, విశ్వబాయి, బావునే బాబురావు, ప్రణీత, అనసూయ, మీరాబాయి, భీంబాయి, కైలాష్, ఊర్మిళ, గిరుజూబాయి, భీంరావు, ఎల్కారి పార్వతీ, శ్రీలత, సువర్ణ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాటం చేస్తాం : ఆర్ఎస్పీ

- పట్టేదారు లేకుండానే భూమికాజేస్తున్నారు
- అందవెల్లి వంతెనపై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేదు



రైతు సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్పీ

నవతెలంగాణ-బెజ్జూర్

దహెగాం మండలం అందవెల్లి వాగుపై వంతెన నిర్మాణం నాసిరకంగా జరిగిందని దీంతో గత ఐదు సంవత్సరాల నుండి 40 గ్రామాల ప్రజలు ప్రతి వర్షాకాలం నానా ఇబ్బందులు పడుతున్నారని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మర్తిడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందవెల్లి తాత్కాలిక వంతెన వర్షానికి కొట్టుకపోయి గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని దీంతో ఆ వంతెనను పరిశీలించడానికి తాను వస్తున్నానని తెలుసుకొని అధికారులు హడావిడిగా వంతెన పనులు ప్రారంభించారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ వంతెనపై తాత్కాలిక రోడ్లు వేసి లక్షల రూపాయల ప్రభుత్వ ధనాన్ని వృధా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నాయకులకు ఈ వంతెనపై తాత్కాలిక రోడ్డు నిర్మాణం ఒక వరంగా మారిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఈ వంతెనపై గతంలో వరి నాట్లు వేశారని ఇప్పుడు ఆయనే అధికారంలో ఉండి ధర్నా చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వంతో పని చేయించలేని ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమాయక ప్రజల నుండి భూమిని లాగేసుకుంటూ భూమాఫియా మండలంలో కొనసాగుతుందని దీన్ని నివారించేందుకు ఎంతవరకైనా పోరాడుతానని స్పష్టం చేశారు. అంబగడ్డ గ్రామంలో భూ సమస్యపై పోలీసులు అతి ఉత్సాహం ప్రదర్శిస్తున్నారని భూమి పట్టా ఉన్న రైతునే ఒరిజినల్ పట్టా కాదా అని నిరూపించుకోవాలని అనడం ఎంతవరకు సమంజసమన్నారు. అధికార పార్టీ నాయకులకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని వారి అడుగులకు మడుగులొత్తుతున్నారని ఆరోపించారు. కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌ని కూడా తప్పుపడుతున్న పోలీసులను ఏమనుకోవాలన్నారు. బెజ్జూర్ మండలంలో వందల ఎకరాల్లో భూమాఫియా జరుగుతుందని దీనిపై పోరాటం చేస్తామన్నారు. పోడు భూములపై పోరాటం సాగిస్తామని గతంలో పోడు వ్యవసాయం చేసుకున్న రైతుల జోలికి అటవీ అధికారులు వెళ్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సోమినిలో వేదం బాపు అనే వ్యక్తి భూమిని తనకు తెలియకుండానే భూమాఫియా వారు పట్టా చేసుకొని ఇతరులకు అమ్మారని ఇది మూడుసార్లు అమ్మకాలు జరిగిందన్నారు. తను కాస్తులో వేదం బాబుకు రైతుబంధు రావడంలేదని పిఓపి ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కారం చేయలేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే తప్పుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోడు భూముల సమస్య పరిష్కారం, విత్తనాల కృత్రిమ కొరత అంశాలపై రైతు సదస్సును నిర్వహిస్తున్నామని దానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండ రాంప్రసాద్, రాజ్ కుమార్ యాదవ్, రాజు, భూస సారయ్య, సోయం చిన్నయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన



బ్యాంక్ సేవల గురించి విద్యార్థులకు వివరిస్తున్న నిర్వాహణ అధికారి నరసింహా

నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కౌటాల శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని భారతి విద్యా మందిర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ నిర్వహణ అధికారి నరసింహ స్వామి మాట్లాడుతూ పిల్లలకి చిన్నప్పటి నుంచే పొదుపు అలవాట్లు నేర్చుకోవాలని, ఆర్థిక క్రమశిక్షణను కలిగి ఉండాలని తెలిపారు. పిల్లలు ఇప్పటి నుండే పొదుపు చేసుకొని చిన్నచిన్న మొత్తాన్ని వారివారి బ్యాంకు ఖాతాలలో నిలువ చేసుకుంటే భవిష్యత్తులో విద్యార్థులకు అవసరమైన సమయంలో విద్యా రుణాలు, అవసరాలలో అనుకూలంగా ఉంటుందని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి చదువులలో ఉన్నతమైన మార్కులు సంపాదించి తల్లిదండ్రులకు సమాజానికి ఊరికి మంచి పేరు తేవాలన్నారు. బ్యాంకు ద్వారా నియమించబడిన ఫ్లాక్ కౌన్సిలర్ ఎల్. ప్రేమ్‌రావు మాట్లాడుతూ మొబైల్ ఫోన్లను ఎక్కడ పడితే అక్కడ చార్జింగ్ పెట్టుకోవద్దని, సైబర్ మోసాలకు లోను కావద్దని, తమ ఖాతాల పిన్ నెంబర్లు ఎవరికి తెలియజేయవద్దని సూచించారు. విద్యార్థులు వారి లక్ష్యాలను ఎంచుకుంటూ దానికి అనుగుణంగా రాణించాలన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి మోసం జరిగిన డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భారతీయ విద్యా మందిర్ హెడ్ మాస్టర్ దుర్గం గోపాల్, విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేట్ విద్యా సంస్థలను నియంత్రించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలే సాయికృష్ణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రయివేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని వాటిని నియంత్రణ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపి సాయికృష్ణ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వసాకె సాయికుమార్‌తో కలిసి జిల్లా విద్యాధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిగ్గా విధులకు హాజరు కావడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మన ఊరు మనబడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు యూనిఫామ్‌లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, జిల్లా సహాయ కార్యదర్శి జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు రాజేందర్, నాయకులు మణివర్మ పాల్గొన్నారు.

ఎట్టకేలకు జిల్లా ఆస్పత్రిలో మొదటి ఆపరేషన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో గర్భిణీలకు సిజేరియన్ చేయడానికి కావాల్సిన అన్ని వసతులు కల్పించినప్పటికీ ఎవరు ఆపరేషన్ కోసం రాకపోవడంతో వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి సీతక్క అన్ని శాఖల సమీక్ష సమావేశంలో కూడా ఆపరేషన్‌పై పెద్ద ఎత్తున చర్చ జరగడంతో పాటు ప్రజాప్రతినిధులు లేదా అధికారులు తమకు చెందిన వారిని సిజేరియన్ కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి ప్రజలకు నమ్మకం కలిగించాలని సూచించారు. దీనికి తోడు వైద్యులు కూడా ప్రయత్నం చేయడంతో సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో మొట్టమొదటి ఆపరేషన్ జరిగింది. మండలంలోని అంకుసాపూర్‌కు చెందిన లోబడి ప్రకాష్ భార్య శోభకు ఆస్పత్రి సూపరిండెంట్ చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఆపరేషన్ చేయగా బాబుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉండడంతో జిల్లా ఆస్పత్రిలో వైద్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మొదటిసారి ఆపరేషన్‌లో ఆస్పత్రి వైద్యులు హర్షవర్ధన్, కవిత, అనస్తీషియ డాక్టర్ మహేందర్, హెడ్ నర్స్ కుసుమ కుమారి, నర్సులు హేమలత, ఫసియొద్దీన్, మౌనిక పాల్గొన్నారు.

వర్మి కంపోస్టు ఎరువుల అమ్మకం



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో తయారు చేసిన వర్మి కంపోస్ట్ ఎరువుల విక్రయించారు. సోమవారం 1730 కిలోల వర్మికంపోస్టు విక్రయించగా గ్రామ పంచాయతీలకు రూ.51900 ఆదాయం వచ్చినట్లు ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ మాట్లాడుతూ వర్మి కంపోస్టు ఎరువులతో ఎక్కువ దిగుబడి వస్తుందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సప్లమెంటరీ ఫలితాల్లో జిల్లాకు 4వ స్థానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో సోమవారం విడుదలైన సప్లమెంటరీ ఫలితాల్లో ఆసిఫాబాద్ జిల్లాకు ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 4వ స్థానంలో నిలిచింది. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ తెలిపిన వివరాల ప్రకారం సప్లమెంటరీ పరీక్షల్లో మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 1738 మంది హాజరు కాగా 1109 మంది ఉత్తీర్ణత సాధించారని, ఒకేషనల్‌లో 201కి 128 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జనరల్ విభాగంలో 1028 మందికి 699 మంది ఉత్తీర్ణత సాధించగా, ఒకేషనల్ విభాగంలో 120 మందికి 73 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో ద్వితీయ సంవత్సరంలో 4వ స్థానం, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 14వ స్థానం సంపాదించినట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని రుద్రపూర్ గ్రామానికి చెందిన పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుద్రాపూర్ గ్రామ సమీపంలో గల వాగులో అక్రమంగా జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో ఇసుకను తరలిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన దుర్గం సుగుణాకర్, మోర్లే బాబురావు, పెరుగు లక్ష్మణ్, కొట్రంగి శ్రీనివాస్ అరికట్టాలని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు సిబ్బంది స్పందించి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ప్రదేశానికి వెళ్ల అప్పటికే డోకే శ్రీను, కవ్వాల సాగర్, కవ్వాల సందీప్, కవ్వాల వినోద్, కుదురుపాక తిరుపతి, లెందుగురే సంఘ్ దేవ్ కులం పేరుతో దూషిస్తూ దుర్గం సుగుణాకర్, మోర్లే బాబురావు, పెరుగు లక్ష్మణ్, కొట్రంగి శ్రీనివాస్‌పై దాడి చేశారు. ఈ విషయమైన ఫిర్యాదు చేయడంతో ఆరుగురిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసు నమోదుకి సంబంధించిన వివరాలను పోలీసు స్టేషన్‌లో కౌటాల సీఐ సాదిక్ పాషా తెలియజేశారు.

చెరువు మరమ్మత్తులు చేపట్టాలని వినతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ పెద్దాపూర్ శివారులోని చెరువుకు మరమ్మత్తులు చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో దేవాపూర్ రైతులు వినతిపత్రం అందించారు. చెరువు కుడికాలువ, ఎడుమ కాలువల్లో మట్టి కూరుకు పోవడంతో ప్రతి ఏడాది కాలువలకు గండి పడడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే రెండు కాలువల్లో పూడికలు తీయాలని కోరారు.



డీఏఓ ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సురేఖ తనిఖీ చేశారు. సోమవారం ఆమె ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రతి వారానికి ఒక మండలంలో ఐదు దుకాణాలను తనిఖీ చేస్తున్నామని ఆమె వెల్లడించారు. ప్రతి దుకాణదారుడు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యమైన ఎరువులు, విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలన్నారు. నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈఓ మహేష్ పాల్గొన్నారు.



నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

నిబంధనలు పాటించని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీబీఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేష్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో టీబీఎస్ఎఫ్, బీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాగిరి రాజేష్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో కొన్ని కార్పొరేట్ పాఠశాలలు, ప్రయివేట్ (శ్రీ చైతన్య, నారాయణ, గ్రీన్ వుడ్, ట్రినిటీ, అభ్యాస, కార్మల్)పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు వారి సొంత సెలబస్‌ను బోధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి ముద్రించినటువంటి పాఠ్యపుస్తకాలలోని పాఠాలు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు ర్యాంకులు రావాలని ఆడంబరాలతో (ఐఐటి, నీట్, ఒలంప్యాడ్, ఈటెక్నో, ఇంటర్నేషనల్, స్మార్ట్, ఎథిక్, ఎక్సెన్సీ, డీజీ) లాంటి ఆకర్షణీయమైన పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసపూరిత మాయ మాటలు చెబుతూ ధనార్జనే ధేయంగా విద్యార్థి తల్లిదండ్రుల నుంచి లక్షల్లో వసూలు చేస్తున్నారన్నారు. విద్యాహక్కు చట్టం (జీవో ఎంఎస్ 1) ప్రకారం పాఠశాలలో ప్రభుత్వంచే ముద్రించినటువంటి పాఠ్యపుస్తకాలలోని పాఠాలు మాత్రమే బోధించాలన్నారు. కానీ అలా కాకుండా వీరు సొంత సెలబస్‌ను విద్యార్థులకు బలవంతంగా నేర్పియడం వలన మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వేముల కిరణ్, టీబీఎస్ఎఫ్ జిల్లా నాయకులు పైడిపల్లి సాయికుమార్ పాల్గొన్నారు.

33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిధి విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం మరో 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు నర్సింగాపూర్ గ్రామ పంచాయతి పరిధిలో 33 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి సోమవారం ఎస్ఈ శ్రీనివాస్ స్థలాన్ని పరిశీలించారు. భీమారం మండల కేంద్రంలో గల సబ్ స్టేషన్‌తో పాటు కాజీపల్లి, దాంపూర్, ధర్మారం, రెడ్డిపల్లి గ్రామాలకు అనువుగా మరో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల వారు గత కొంత కాలంగా అభ్యర్థిస్తున్నారు. వినియోగదారుల అభ్యర్థనకు తోడు స్థానిక నాయకుల ఒత్తిడితో నర్సింగాపూర్ గ్రామ పంచాయతి పరిధిలో సబ్ స్టేషన్ ఏర్పాటు ప్రక్రియను విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించారు. సబ్ స్టేషన్ ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భుక్య తిరుమల లక్ష్మన్, ఎంపీటీసీ పెద్దల రూప బాపు, తాజా మాజీ సర్పంచ్ దుర్గం మల్లేష్, కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేష్ గ్రామస్థులు గట్టయ్య పాల్గొన్నారు.

పాన్ కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులు అందరూ పాన్ కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా పేర్కొన్నారు. జూన్ 30వ తేదీ వరకు చివరి అవకాశం ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ కల్పించిందని, సింగరేణి కార్మికులందరూ పాన్ కార్డుతో ఆధార్ కార్డు అనుసంధానం లేని వారందరూ ఈ నెల 30వ తేదీ లోపు అనుసంధానం చేసుకోవాలని, లేనియెడల ప్రతి కార్మికుడి వార్షిక ఆదాయం నుండి 20 శాతం వరకు పెనాల్టీ విధిస్తామని ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ తెలియజేసిందన్నారు. దీనివలన ప్రతి కార్మికుడికి దాదాపు రూ.1,50,000 నుంచి రెండు లక్షల వరకు పెనాల్టీ తోపాటు భవిష్యత్తులో ఇన్కమ్ టాక్స్ రిటర్న్స్, బ్యాంకు రుణాలు, పాస్పోర్ట్ కానీ తీసుకోవడానికి అనుమతించరని, కాబట్టి అనుసంధానం చేసుకొని కార్మికులు అనుసంధానం చేసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా వారు కోరారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్టీపీపీ పవర్‌మేక్ కంపెనీ హెచ్ఆర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-జైపూర్

అకారణంగా ఉద్యోగంలో నుంచి తీసివేయడం తగదని, తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని అభ్యర్థించినందుకు అమర్యాదగా కులం పేరుతో దూషించిన పవర్‌మేక్ కంపెనీ హెచ్ఆర్ మధుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ మహిళ తుంగపిండి స్వప్న డిమాండ్ చేశారు. జీతం పెంచాలని కోరిన నన్ను ఉద్యోగం నుండి తీసేసిన హెచ్ఆర్ మధు సోమవారం పెగడపల్లి గ్రామానికి వచ్చిన సందర్భంగా తిరిగి ఉద్యోగంలో తీసుకోవాలని కోరితే మాదిగదాన అంటూ కులం పేరుతో దూషించడంతో పాటు దిక్కున్నదగ్గర చెప్పుకో అంటూ అమర్యాదగా వ్యహరించడాని తెలిపారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసింది. పవర్‌ప్లాంట్ ప్రభావిత గ్రామమైన ఎల్కంటికి చెందిన బాధితురాలు రూ.8 వేల జీతంతో ఎస్టీపీపీలో కొంత కాలం హౌజ్ కీపింగ్‌గా ఉద్యోగంలో చేరింది. నెల వారి జీతం పెంచాలని కోరుతూ పవర్‌మేక్ కంపెనీ హెచ్ఆర్ మధును కలిసి వేడుకోగా జీతం పెంచకపోగా నాపై పని ఒత్తిడి పెంచి చివరికి ఉద్యోగం నుండి తీసివేసినట్లు పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో వెల్లడించింది. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించాలని, పవర్‌మేక్ కంపెనీ అధికారులను కట్టడి చేయాలని కోరిన ఆమెకు హౌజ్ కీపింగ్ ఉద్యోగం తిరిగి ఇప్పించాలని సింగరేణి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొంది.

పెండింగ్ వేతనం, గుడ్ల బిల్లు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ-నస్పూర్

పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం, గుడ్ల బిల్లు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరితో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే, మెనూ చార్జీలు పెండింగ్లో ఉన్నాయని, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, వంట చేసి పెడుతున్నామని అన్నారు. దీంతో కార్మికులు అప్పులపాలౌతున్నారని, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాలలు పున:ప్రారంభం అయినప్పటికీ గతంలో చేసిన వాటికే బిల్లులు రాలేదని, పైగా రాగి జావ పోయాలని, బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. పెరిగిన వేతనం కొన్ని జిల్లాల్లో కొన్ని మండలాల్లో మాత్రమే ఇచ్చారని, అది కూడా నెల నెలా సక్రమంగా ఇవ్వడం లేదని అన్నారు. మెనూ చార్జీలు పెంచాలని, కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలన్నారు. గుడ్లకు అదనం బడ్జెట్ కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు రవి, జన్నారం మండల కన్వినర్ అంబటి లక్ష్మణ్, లక్ష్మి, కళావతి, వసంత, కరీమా, రబియా, మధునమ్మ, స్వాతి, గట్టక్క, అనసూయ, మానస, బాణమ్మ పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యం

నవతెలంగాణ-మంచిర్యాల

మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యమని మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ రాజమౌళిగౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హై స్కూల్‌లో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే షి టీం కర్తవ్యం అని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచిగా చదువుకోవాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, మహిళలు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం నిత్యం జరిగే సైబర్ క్రైం నేరాలపై అవగాహనా కల్పించారు. వచ్చిన ఫిర్యాదుపై తక్షణమే షీ టీం పోలీసులు స్పందించి సంబంధిత విభాగాలకు సమాచారం అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు షీ టీం బృందాలు సహాయం చేస్తాయని తెలిపారు. ఆకతాయిల అల్లర్లతో వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేయాలనుకుంటే ఈ 6303923700 నెంబర్ సంప్రదించాలని కోరారు. అలాగే అత్యవసర సమయంలో డయల్ 100కి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో షీ టీమ్ ఎస్.ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది కానిస్టేబుల్ శ్రావన్ కుమార్, సతీష్, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, పాఠశాల హెచ్ఎమ్ పద్మావతి, ఉపాధ్యాయురాలు సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలను నిరోధించడంలో భాగంగా మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, ఆబ్కారీ-మద్యనిషేధ శాఖ అధికారి నందగోపాల్, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ చందన, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్‌కుమార్ ఇతర అధికారులతో కలిసి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల విక్రయం, వినియోగాల నిరోధం, మిషన్ పరివర్తన కార్యక్రమ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, వినియోగం పూర్తి స్థాయిలో నిరోధించాలని సూచించారు. విద్యా సంస్థలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, గంజాయి ఇతరత్రా మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని, అసాధారణ ప్రవర్తన కలిగిన విద్యార్థులను గుర్తించి కౌన్సిలింగ్ ద్వారా మార్పు తీసుకురావాలని తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే 100 నెంబర్, ఆబారీ, మద్యనిషేధ శాఖ నం.18004252523లలో సమాచారం అందించేలా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి భవిష్యత్తు ఉద్యోగులపై ఉంది

- ఇన్‌చార్జి జీఎం ఎం. శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి భవిష్యత్తు నూతన ఉద్యోగులపై ఉందని ఇన్‌చార్జి జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నియామకం పొందిన 102 మంది యువతీ యువకులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, దక్షిణ భారతదేశంలోనే సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. అలాగే తమ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ, క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సింగరేణిని లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. అదే విధంగా వారి తల్లిదండ్రులను, అత్త మామలను కూడా మంచిగా చూసుకోవాలని సూచించారు. సింగరేణిలో రెండవ తరానికి ఉద్యోగాలు రావడం మీ అదృష్టంగా భావించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఎస్ఓ టూ జీఎం వి పురుషోత్తమరెడ్డి, డీజీఎం (ప) అరవింద రావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పీఓ కాంతారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.



సోలార్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయండి

- రామారావుపేట్ గ్రామస్తుల విజ్ఞప్తి



నవతెలంగాణ-జైపూర్

ఇందారం నుండి రామారావుపేట్ వరకు చెరువు కట్ట మీదుగా నిర్మించిన రోడ్డులో సోలార్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని రామారావుపేట్ గ్రామస్థులు కోరుతున్నారు. ఒక వైపు చెరువు మరో వైపు పంట పొలాలు, చెరువు కట్ట మీదుగా ప్రయాణం ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతి కార్యదర్శి ద్వార సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. శ్రీరాంపూర్, ఇందారం ఓపన్‌కాస్ట్ గనుల విస్తరణతో రామారావుపేట్ గ్రామానికి సంబంధించిన దారులన్నీ మూసుకుపోవడంతో చెరువు కట్ట మీదుగా ప్రయాణించడం తప్ప మారో మార్గం లేదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్ట మీదుగా రాత్రి పూట ప్రయాణించాల్సిన సంధర్భంలో ఎప్పుడు ఏ ప్రమాదంలో ఇరుక్కొవల్సి వస్తుందో తెలియకుండా ఉన్నదని పేర్కొంటున్నారు. రామారావుపేట్ గ్రామానికి సంబంధించిన ఇతర మార్గాలను శ్రీరాంపూర్ ఓసీ విస్తరణతో మూసి వేశారని గ్రామస్థుల సౌకర్యార్థం ఇందారం-రామారావుపేట్ మధ్య రోడ్డు విస్తరిస్తూ పున:నిర్మించినట్లు తెలిపారు. అదే క్రమంలో చెరువు కట్ట మీదుగా రోడ్డు పొడవు లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామని గతంలో సింగరేణి అధికారులు హామీ ఇచ్చినప్పటికి నిర్లక్ష్యం చేస్తుండటం ఇబ్బందిగా మారిందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామస్థులు సింగరేణి శ్రీరాంపూర్ జీఎం సంజీవ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై స్పందించిన జీఎం సంజీవ రెడ్డి సోలార్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు స్థానిక నాయకులు నామాల తిరుపతి, తంగళ్లపల్లి వెంకటేశ్, ముదాం రమేష్, దుర్గం రాజకుమార్, గోలి యాదగిరి, గుండ శ్రీనివాస్ తెలిపారు.

మళ్లీ సెల్ టవర్ ఎక్కిన ఎస్టీపీపీ కార్మికుడు



నవతెలంగాణ-జైపూర్

పీఎఫ్ కటింగ్, అలవెన్స్‌ల చెల్లింపుల్లో తలెత్తిన సమస్యను పరిష్కరిస్తామని ఎస్టీపీపీ అధికారుల హామి నెరవేర్చకపోవడంతో కార్మికుడు మధు సోమవారం మళ్లీ సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. అధికారుల తీరును నిరసిస్తూ ప్లాంట్ సమీపంలో గల సెల్ టవర్ ఎక్కి హల్ చల్ చేశాడు. ఇదే విషయమై మార్చి 16న మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల సెల్ టవర్ ఎక్కి న్యాయం చేయాలని డిమాండ్ చేయగా సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు పీఎఫ్ కటింగ్ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు హామీ ఇచ్చి మూడు నెలలు గడిచిపోయినా సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో మరో మారు సెల్ టవర్ ఎక్కి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశాడు. గత ఆరు సంవత్సరాలుగా పవర్‌మేక్ కంపెనీలో సీహెచ్‌పీ మెకానికల్ విభాగంలో కార్మికునిగా పని చేస్తున్న మధు సంస్థ పరంగా పీఎఫ్ కటింగ్ చేయకపోవడంతో పాటు ఇతర అలవెన్సుల చెల్లింపుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని ఆవేధన వ్యక్తం చేశారు. విషయం తెల్సుకున్న పవర్‌మేక్ కంపనీకి చెందిన హెచ్ఆర్ మధు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సర్దుమనిగింది.

నిబంధనలకు విరుద్దంగా బస్సులు నడిపితే కఠిన చర్యలు



నవతెలంగాణ-మందమర్రి

విద్యా సంస్థల నిబంధనలకు విరుద్దంగా బస్సులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పిల్లలను తీసుకెళ్లే వాహనాలను తప్పనిసరిగా కండిషన్‌లో ఉంచుకోవాలన్నారు. ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ కిట్, ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలని, డ్రైవర్ తప్పకుండా యూనిఫామ్ వేసుకోవాలన్నారు. ఇన్సూరెన్స్, పర్మిట్, అటెండర్ లేని బస్సులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎటువంటి అనుమతులు, పత్రాలు లేకుండా బస్సులు నడిపినా, పరిమితికి మించి విద్యార్థులను తరలించినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

బెల్లంపల్లి మున్సిపాలిటీలో పని చేసిన పట్టణ ప్రగతి, హరితహారం కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట మున్సిపల్ పట్టణ ప్రగతి కార్మికులు ధర్నా చేసిన అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపాలిటి పరిధిలో పట్టణ ప్రగతి హరిత హరం మొక్కల పెంపకం, పార్క్ పరిశుభ్రత చేసేందుకు 15 మంది మహిళ కార్మికులు గత 5 సంవత్సరాల నుండి పనులు చేస్తున్నారని, కానీ గత సంవత్సరం డిసెంబర్, జనవరి 2 నెలలు వెతనాలు చెల్లించలేదన్నారు. మున్సిపాలిటీ కమిషనర్ అకారణంగా విధుల నుండి తొలగించారని, వారిని విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలన్నారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు లావణ్య, లతా మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా పనులు చేస్తున్నామని, కానీ ఇప్పుడు మున్సిపాలిటీ బడ్జెట్ లేదని తొలగించారని వాపోయారు. మమ్మల్ని తిరిగి వీధుల్లోకి తీసుకోవాలని గత ఐదు నెలలుగా ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్, కౌన్సిలర్ల చుట్టూ తిరిగిన ఫలితం రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాధా, భాగ్య రేణుక, శారదా, లక్ష్మణ్, నిల, రమక్క, వనజ, గంగ పాల్గొన్నారు.

మందమర్రిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రిలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం మందమర్రి ఎన్నికల సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మాట్లాడుతూ మందమర్రిలో పాలకవర్గం లేక గత కొన్ని సంవత్సరాలుగా పాలన అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంపై ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన కలెక్టర్ మందమర్రిలో స్థానిక సంస్థల ఎన్నిక విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడికందుల రమేష్, మేసినేని అరుణ్, కస్తూరి శ్రీనాథ్ చారి, రామంచ తిరుపతి, ఎండీ ముజాహిద్, పాలమాకుల భీమ్ సేన్, ముడారపు శేఖర్, సోనాల్ శర్మ, గంట రాకేశ్, కాసర్ల రంజిత్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | జూన్ 25, 2024 | www.navatelangana.com

పూర్తిస్థాయిలో మరుగుదొడ్ల లక్ష్యాన్ని సాధించాలి

నవతెలంగాణ-జన్నారం



ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు ఉండేలా ప్రభుత్వం నిర్దేశించిన 100 శాతం లక్ష్యాన్ని అధికారులు సాధించాలని ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి సూచించారు. మరుగుదొడ్లపై సర్వే చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రమేష్, ఏపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన ఆదర్శ విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు అదీబా తెహ్రీమ్, ఎం.శ్రీహర్షిత, దుర్గం విద్యలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సంపాదించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పీఎం శ్రీ పథకానికి కళాశాల ఎంపికైనట్లు తెలిపారు. దీనితో మౌలిక వసతులతో పాటు మరింత నాణ్యమైన విద్య అందనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాను రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎనీమియా ముక్త్ భారత్ రాష్ట్ర టీమ్ మెంబర్లు రవి నాయుడు, హేత్వి అన్నారు. రక్తహీనత నివారించే ఉద్దేశంతో జిల్లాలో పరిస్థితి తెలుసుకోవడానికి జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ సబ్ సెంటర్‌తో పాటు కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం అందజేయాలన్నారు. అప్పుడే రక్తహీనత నివారణ సాధ్యమవుతుందన్నారు. ఎర్ర రక్త కణాలు పెరిగినప్పుడు రక్తహీనత నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ ప్రాధాన్యత వివరించాలన్నారు. ఎనీమియా ముక్త్ భారత్‌లో భాగంగా రక్తహీనత లేని రాష్ట్రంగా తయారు చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, జిల్లా ఎపిడమాలజిస్ట్ ప్రశాంత్ కుమార్, ఆర్‌బీఎస్‌కే టీం, అడ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను సమిష్టిగా నివారించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మత్తు పదార్థల నివారణపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఈ నెల 26న ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవ నిర్వహణ సందర్భంగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యాన్ని కోల్పోవడమే కాకుండా కుటుంబమంతా ఆర్థికంగా నష్టపోతారన్నారు. విద్యార్థులు, యువత చెడువ్యాసనాలకు అలవాటు పడకుండా అధికారులు అవగాహన కల్పించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ మాదకద్రవ్య నివారణా దినోత్సవం రోజు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యార్థులు, యువకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వలన వచ్చే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందచేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డీఎస్పీ సదయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సరుకుల సరఫరాపై ముగిసిన టెండర్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని సాంఘిక సంక్షేమ, మహాత్మ జ్యోతిబాపూలే, ఎస్సీ సంక్షేమ శాఖ గురుకులాలతో పాటు కేజీబీవీ పాఠశాలల్లో రానున్న విద్యా సంవత్సరానికి గాను వివిధ రకాల సరుకుల సరఫరాకు సంబంధించి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు అధ్యక్షతన టెండర్ల ప్రక్రియ ముగిసింది. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి టెండర్ దారులు కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. హాస్టల్లో 70 రకాల వస్తువులు సరఫరా చేయడానికి టెండర్లు నిర్వహించారు. గతంలోనే టెండర్ దారులు తమ కోడింగ్‌లతో దరఖాస్తు చేసినప్పటికీ, రాష్ట్రంలోని ఇతర జిల్లాలో వేసిన అతి తక్కువ రేట్లను పరిగణలోకి తీసుకున్న అధికారులు జిల్లాలో టెండర్ దారులు వేసిన రేట్లను సవరించారు. ఈ సందర్భంగా టెండర్‌దారులు ఎవరు తక్కువ ధరకు సరఫరా చేస్తారనే దానిని ఆధారంగా చేసుకుని టెండర్లు కేటాయించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. అయితే పలువురు టెండర్ దారులు తాము తక్కువ ధరకు వేసినప్పటికీ అధికారులు తమకు కేటాయించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, ఆర్సీఓ స్వరూప రాణి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

కన్వేయన్స్ డ్రైవర్ల నిరసన



నవతెలంగాణ-మందమర్రి

కన్వేయన్స్ డ్రైవర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయం, కెకె ఓసి, వర్క్ షాప్, కాసీపేట, కెకె-5, రెస్క్యూ ఆఫీసు, ఆర్‌కేపీ ఓసి లల్లో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్లు 2 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని నల్ల బ్యాడ్జీలతో విధుల్లో పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్వేయన్స్ డ్రైవర్లకు 2 నెలలుగా వేతనాలు లేక ఆర్థికంగా కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. వేతనాల కోసం ఓనర్లను అడిగినా బిల్లులు అయితేనే ఇస్తామంటూ నెలలు గడుపుతున్నారని, ఈ విషయంపై అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. బిల్లులతో సంబంధం లేకుండా కార్మికులకు ప్రతి నెలా 7వ తేదిన వేతనాలు ఇవ్వాలని యాజమాన్యం సర్క్యులర్ ఇచ్చినా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదని ఆరోపించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి నెల వేతనాలు వచ్చినప్పటికీ పెరిగిన ధరలకు వచ్చే జీతం ఏ మూలకు సరిపోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కన్వేయన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్

- సివిల్ సమస్యలపై అర్జీలు ఇవ్వొద్దు
- ఆదిలాబాద్ లెక్టర్ రాజర్షి షా



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో భూసంబంధిత సమస్యలను పరిష్కరించడం జరగదని, వాటిని కోర్టులో పరిష్కరించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు జిల్లాలోని నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలు భూసంబంధిత, సివిల్ కేసులకు సంబంధించి వినతులను కలెక్టరేట్‌లో ఇవ్వొద్దని కలెక్టర్ సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెనువెంటనే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీఓలు వినోద్ కుమార్, జీవాకర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలి..

విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల కాక ఇబ్బందులు పడుతున్నామని కాకతీయ యూనివర్సిటి ప్రయివేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు అన్నారు. సోమవారం ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2021 నుంచి 2024 విద్యా సంవత్సరం వరకు ఫీజు రియంబర్స్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వం విడదల చేయని కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. డిగ్రీ విద్యార్థుల మూడు సంవత్సరాల ఫీజు, రియంబర్స్‌మెంట్ ఇంకా రాలేదన్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లాలని కోరినట్టు పేర్కొన్నారు.

కబ్జాకు గురైన భూమిని కాపాడాలి..

పట్టణంలో ప్రభుత్వ విలువైన భూమి కబ్జాకు గురైందని దాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని రిమ్స్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పక్కన 1984లో వికార్ సెక్షన్ కింద ప్రభుత్వం ప్రజల అవరాల కోసం ఆరు గుంటల భూమిని కేటాయించిందన్నారు. కానీ దాన్ని కొందరు కబ్జా చేశారని, మున్సిపల్ అధికారులు వెళ్లిన బయపెడుతున్నారన్నారు. దాన్ని కాపాడాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఇందులో సీపీఐ నాయకులు కుంటాల రాములు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందేలా చూడాలి..

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో తమ ఎద్దు చనిపోయిందని, దానికి నష్ట పరిహారం ఇవ్వాలని బజార్‌హత్నూర్ మండలానికి చెందిన బాధితుడు పోశెట్టి తెలిపారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి 2న తన వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి తన ఎద్దు ప్రాణాలు కోల్పోయిందని తెలిపారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం మూలంగా విద్యుత్ తీగలు వేలాడుతూ ఎద్దుకు తగిలి ప్రాణాలు కోల్పోయిందన్నారు. నష్టపరిహారం కోసం పలుమార్లు పత్రాలు సమర్పించిన కూడా ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదని వాపోయాడు. తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

కొనసాగుతున్న కిష్టాపూర్ చెరువు సర్వే

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ గ్రామశివారులో ఉన్న ఊర చెరువుపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల చేపట్టిన సర్వే సోమవారం కొనసాగింది. ఆ చెరువు కబ్జాకు గురవుతోందని ఆ గ్రామ మత్స్యకారులు, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు రెండు శాఖల అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి చెరువు భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జాతీయ విద్యావిధానం-2020కి అనుగుణంగా నూతన పాఠ్య ప్రణాళికల్లో జరిగిన మార్పులపై రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు పట్టణంలో అంగన్వాడీ టీచర్‌లకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ వనజ ఆధ్వర్యంలో తరగతులు కొనసాగించారు. అంగన్‌వాడీలు శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యా వ్యవస్థ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్‌లు ఫర్హా, విజయలక్ష్మి, నీరజ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుని కుటుంబానిక ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మురుమడుగు గ్రామానికి చెందిన గద్దల రాజన్న అనే గల్ఫ్ కార్మికునికి యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ వారం రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మురిమడుగు గ్రామ గల్ఫ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పూడూరు సతీష్, సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పూడూరి సతీష్ మాట్లాడుతూ గల్ఫ్ కార్మికులను వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలోఉపాధ్యక్షుడు సిరికొండ వెంకటేష్, క్యాషియర్ ఆకుల లాలయ్య, సిరికొండ లచ్చన్న పాల్గొన్నారు.

పాత్రికేయులు తప్పుడు వార్తలు రాయొద్దు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

విలేఖరులు ఎవరో చెప్పిన తప్పుడు సమాచారాన్ని నమ్మి వార్తలు రాసి మంచి అధికారులకు ఇబ్బంది కలిగించటం సరికాదని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. కొందరు వ్యక్తులు వారి స్వలాభం కోసం ఇచ్చే తప్పుడు సమాచారాన్ని పాత్రికేయులు గ్రహించాలని తెలిపారు. మండల సమావేశం అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ తనపై ప్రచురితమైన వార్త విషయాన్ని ఎమ్మెల్యేకు వివరిస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. స్థానికంగా కొందరు సంఘ నాయకుల పేరుతో వేదిస్తున్న తీరును ఆమె ఎమ్మెల్యేకు వివరించారు. విషయం తెలుసుకోకుండా రాసే వార్తల ఒత్తడి కారణంగా తాను ఉద్యోగాన్ని వదులుకోవడమా చనిపోవాలా అనే నిర్ణయానికి వచ్చినట్లు తనతో చెప్పడం భాదాకరమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. తప్పుచేసిన వారి విషయంలో వార్తలు రాస్తే ఎవరూ అభ్యంతరం చెప్పరని, మంచి అధికారుల విషయంలో ఏదో ఆశించి రాయాలనుకోవడం మంచి విధానం కాదని హెచ్చరించారు. పలు సంఘాల నాయకుల పేరుతో బ్లాక్ మెయిల్ వ్యక్తుల ప్రచారాన్ని నమ్మి విలేఖరులు సమాచారం సేకరించకుండా వార్తలు రాయడాన్ని ఆయన తప్పుబట్టారు. రాసే వార్తలు ప్రభుత్వానికి సూచనగా, ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని ఆయన కోరారు.

సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమానికి పెద్దపీట

నవతెలంగాణ-మందమర్రి



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ సీనియర్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు సమ్మయ్య

సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మిక హక్కుల సాధనకు ఎల్లవేళలా తమ యూనియన్ కృషిచేస్తుందని ఐఎన్‌టీయూసీ సీనియర్ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య అన్నారు. సోమవారం మందమర్రి ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏరియా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి కొంగు బంగారమైనటువంటి సింగరేణి సంస్థ గడిచిన 134 సంవత్సరాలుగా ఎంతో మంది కార్మికులకు ప్రజలకు నిరుద్యోగులకి లక్షలాది మందికి ఉపాధి ఇచ్చినటువంటి సంస్థ అన్నారు. సంస్థ మీద ఆధారపడి జీవిస్తున్నటువంటి 6 జిల్లాల్లో ఉన్నటువంటి ప్రజానీకమంతటిని వాళ్ళ నోట్లో మట్టి కొట్టె పరిస్థితిని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తుందని దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండిఆర్ ఆక్ట్ బిల్లుకి పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఓట్లు వేసి మద్దతు ఇచ్చారన్నారు. ఏదైతే దేశవ్యాప్తంగా 60కి పైగా బొగ్గు గనులను వేలం పాట వేయడం సరి కాదన్నారు. వేలం పాట ద్వారా కాకుండా బొగ్గు గనులని సింగరేణి సంస్థకే కేటాయించాలన్నారు. 20 రకాల పన్నులు కేంద్ర ప్రభుత్వానికి, 9 రకాల పన్నులు రాష్ట్ర ప్రభుత్వానికి సంస్థ చెల్లించడమే కాకుండా డీఎ ఎఫ్టి ఫండ్స్, సిఎస్ఆర్ ఫండ్స్ రూపంలో పరిసర ప్రాంతాల్లో స్కూల్స్, రోడ్లు, నీటి వసతులు, తదితర వసతులకు ఇవ్వడానికి తోడ్పాటు అందిస్తున్న సంస్థని లేకుండా చేయడమే కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. వేలం వేయడమంటే పెట్టుబడిదారులకు లాభం చేకూర్చడమేనని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని ఐఎన్‌టీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. జనక్ ప్రసాద్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేసి బొగ్గు గనులను సింగరేణి సంస్థనే సాధించే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సల్లూరి లక్ష్మణ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, రాంశెట్టి నరేందర్ సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, దేవీ భూమయ్య ఐఎన్టియూసి ఏరియా ఉపాధ్యక్షులు, గొర్ల శ్రీనివాస్, బుస రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత పుస్తకాలు, నోట్ బుక్స్, స్టేషనరీ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం అధ్యక్షుడు శేఖర్ బాబు మాట్లాడుతూ పట్టణ పోలీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏర్పడి ఏడు సంవత్సరాలు పూర్తయిన శుభ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామని, ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న పోలీస్ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పట్టణంలో అవసరమైన ప్రతి చోట మా అసోసియేషన్ తరపున సాధ్యమైనంత సాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పాఠశాలలో బాలికలకు మంచినీళ్ల తాగే విషయంలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించి వారికి వాటర్ ప్యూరిఫైయర్ తన సొంత ఖర్చులతో ఇప్పిస్తానని ప్రధానోపాధ్యాయురాలు అనురాధకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సప్ప శ్రీనివాస్, రాజ్ కుమార్, కొల్లి రాజు, సతీష్ రామ్, శ్రీధర్, అక్కపల్లి మల్లేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా కృషి

నవతెలంగాణ-బేల

మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి, ప్రజలకు సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. వంజరిగూడ, ఖార, గరకగూడ గ్రామాలను సోమవారం సందర్శించిన ఆయన అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, అవినాష్ ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అంగన్‌వాడీలకు రూ.18వేలు, ఆయాలకు రూ.15 వేల ఇస్తామని హామీ ఇచ్చిందని కానీ ఇప్పటివరకు చెల్లించడం లేదన్నారు. గత బీఆర్ఎస్ హాయంలో సమస్యల సాధనకు 24 రోజుల సమ్మెల చేస్తే రిటైర్‌మెంట్ బెన్ఫిట్ కు చర్చల్లో ఒప్పుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని తగ్గిస్తు జీఓను తెచ్చిందని దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజెంగుల రాజు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధరణి ఛాయ, ప్రధాన కార్యదరి ఏ.చంద్రకళ, రుక్మిణి, సుశీల, సంగీత, రాధ, నివేదిక, దుర్గా, భాగ్యరేఖ, చారులత పాల్గొన్నారు.

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7, ఆర్కే న్యూటెక్, ఏరియా వర్క్ షాప్, ఏరియా స్టోర్‌లలో కనీస మస్టర్లు చేయని కార్మికులకు ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం మీ అందరి అదృష్టమని మీ తల్లిదండ్రులు ఉద్యోగం చేసిన సమయంలో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవని, ప్రతి ఒక్క ఉద్యోగి తమ హాజరు శాతాన్ని పెంచుకొని సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని అన్నారు. సింగరేణి సంస్థ కల్పిస్తున్న సదుపాయాలు మరెక్కడ లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇప్పటి నుండి అయినా ఉద్యోగులు ప్రతినెల 20 మస్టర్ల చేయాలని సూచించారు. కౌన్సిలింగ్‌కు 93 మంది గైర్హాజరు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఎస్ఓ టు జీఎం వి పురుషోత్తమరెడ్డి, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీవై.సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, డివైపిఎం రాజేష్, సీనియర్ పీఓలు సంతస్, పాల్ సృజన్ పాల్గొన్నారు.

ఏఐఏవైఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవికుమర్

నవతెలంగాణ-దండేపల్లి

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం (ఏఐఏవైఎస్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని ధర్మరావుపేటకు చెందిన కొల్లూరి రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు నియామక పత్రాన్ని అందజేశారు. ఎన్నికైన సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు రాష్ట్ర జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధన, సంఘం బలోపేతానికి పాటుపడతానని అన్నారు.

భూ ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని అంకపల్లి శివారులో గల ఎండీ లాల్ బికి చెందిన 13 ఎకరాల భూమిని చెన్నూరు ఎమ్మెల్యే అనచరులం అనిచెప్పి ఆక్రమించారని మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ సహేరాబాను ఆరోపించారు. ఆమె సోమవారం తాండూర్ తహసీల్దార్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాండూరు మండలం అంకపల్లి శివారులోని సర్వే నెం 81.82.83.84,85 విస్తీర్ణం 13 ఏకరాలు భూమిని మందమర్రి పట్టానానికి చెందిన బండి సదానందం యాదవ్, జక్కుల రాజన్న దౌర్జన్యంగా కబ్జా చేశారని ఆరోపించారు. తాండూర్ గ్రామానికి చెందిన రషీద్, కుమారులను బెదిరించి భూమి ఆక్రమణకు పాల్పడ్డట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.

పార్లమెంట్‌లో అడుగిడిన గడ్డం వంశీకృష్ణ

నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ కురువృద్ధుడు, సీడబ్ల్యూసీ సభ్యులు కాక వెంకటస్వామి వారసత్వంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సోమవారం పార్లమెంట్ భవనంలో అడుగుపెట్టారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కుమారుడు గెలుపొంది తాత వెంకటస్వామి, తండ్రి వివేక్ వారసునిగా మొట్టమొదటి సారి పార్లమెంట్ భవనంలో అడుగు పెట్టారు. దీనికి ముందు పార్లమెంట్ భవనం ఎదుట సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి పెద్దపల్లి పార్లమెంట్ పరిధి ప్రజల ప్రతినిధిగా పార్లమెంట్‌లో అడుగు పెడుతున్నట్లు తన ఐడెంటీని ప్రదర్శించారు.